సాక్షి
ఖమ్మం
మంగళవారం । 8 । ఏప్రిల్ । 2025



పట్టాభిషేకానికి హాజరైన భక్తజనం

రాజాధిరాజుగా..

శ్రీరామ పట్టాభిషేక వేడుకతో భద్రగిరి అయోధ్యపురిగా మారింది. గోదావరి నదీ తీరం సరయూ నదిని తలపించింది. త్రేతాయుగం మరోసారి భద్రాచలం నేలపై సాక్షాత్కరించింది. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలంలో కొలువుదీరిన రామయ్య రాజాధిరాజుగా, సామ్రాట్‌గా సోమవారం భక్తులకు దర్శనమిచ్చాడు. పాంచరాత్ర ఆగమ శాస్త్రాలను అనుసరిస్తూ నిర్వహించిన పట్టాభిషేకం వేడుకకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరై రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీరాముడికి పట్టువస్త్రాలు సమర్పించారు.

– భద్రాచలం



స్వామి వారి పాదుకలు




స్వామివారి గద



శ్రీరామ పట్టాభిషేక ప్రక్రియ నిర్వహిస్తున్న అర్చకులు



రాజముద్రిక



పచ్చలహారం



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



స్వామివారి కిరీటం

వైభవంగా సాగిన శ్రీరామ పట్టాభిసేకం

- అయోధ్యపురిగా మారిన మిథిలా స్టేడియం
- రాజదండం, రాజముద్రిక, రాజ ఖడ్గాలకు పూజలు
- సిరియపాదుక శ్రీ ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు
- పట్టాభిషేకానికి హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ఆలయం నుంచి మిథిలా స్టేడియానికి..

పట్టాభిషేకాన్ని పురస్కరించుకుని సీతాసమేత శ్రీరాముడు లక్ష్మణుడితో కలిసి భక్తుల కోలాహలం నడుమ ప్రధాన ఆలయం నుంచి ప్రత్యేక పల్లకీలో ఉదయం 10:17 గంటలకు మిథిలా స్టేడియానికి చేరుకున్నారు. అర్చకులు మొదట విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం నిర్వహించారు. ఆ తర్వాత శ్రీరాముడికి పట్టాభిషేకం చేసేందుకు వీలుగా పండితులు రుత్విక్కులైన వశిష్టుడు, వామదేవుడు, జాబాలి, కశ్యపుడు, కాత్యాయనుడు, గౌతముడిని తమలో ఆవాహన చేసుకున్నారు.

హనుమంతుని మెడలో ముత్యాల దండ..

రామయ్య పట్టాభిషేకం అనంతరం రామయ్యకు ముత్యాల దండ ధరింప చేశారు. ఇదే దండను సీతాదేవి మెడలోనూ ధరింపచేశారు. చివరకు అదే దండను ఆంజనేయుడి మెడలో వేశారు. దీంతో శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం ముగియగా.. పట్టాభిషేకం అనంతరం సీతాలక్ష్మణ సమేతుడైన రామయ్యకు తాతగుడి సెంటర్ వరకు రథోత్సవం నిర్వహించారు. రథస్థం రాఘవం దృష్ట్వా పునర్జన్మ నవిద్యతే' అని బ్రహ్మ పురాణం చెబుతోందని, రథోత్సవంలో శ్రీ రాముడిని సేవించిన వారికి ముక్తి లభిస్తుందని అర్చకులు వివరించారు.

మండప్రతయ ఆరాధన..

రుత్విక్కరణం తర్వాత పండితులు మండపత్రయ పూజలు ప్రారంభించారు. శ్రీరాముడి పట్టాభిషేకానికి సమస్త దేవతలు, సమస్త నదీ, సముద్ర జలాలతో పాటు రామపరివారాన్ని ఆవాహన చేయడం ఈ మండపత్రయ ఆరాధన ప్రధాన ఉద్దేశం. పట్టాభిషేకం వేదిక దిగువ భాగాన మూడు కలశాలను ఏర్పాటు చేశారు. మధ్య కలశంలో సముద్ర, నదీ జలాలను ఆవాహన చేశారు. ప్రధానంగా తూర్పున పూరీ, దక్షిణాన ధనుష్కోటీ, పశ్చిమాన ద్వారకకు చెందిన సముద్ర జలాలు అవాహన చేయగా ఆగ్నేయం నుంచి గంగా, నైరుతి నుంచి కృష్ణా, వాయువ్యం నుంచి గోదావరి, ఈశాన్యం నుంచి కావేరీ నదీ జలాలను ఆవాహన చేశారు. నదీ, సముద్ర జలాలను ఆవాహన చేసిన కలశానికి కుడివైపున ఉన్న కలశంలో బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులతో పాటు రామపరివారాన్ని ఆవాహన చేశారు. ఇందులో తూర్పున హనుమ, పడమర లక్ష్మణ, ఉత్తరాన శతృఘ్నుడు, దక్షిణాన భరతుడు, ఆగ్నేయంలో అంగదుడు, వాయువ్యంలో సుగ్రీవుడు, ఈశాన్యంలో విభీషణుడు, నైరుతిలో జాంబవతుడిని ఆవాహన చేశారు. ఎడమవైపు కలశంలో అష్టదిక్పాలకులను ఆవాహన చేశారు. పట్టాభిషేకం చేసే రాజముద్రికలో లక్ష్మీదేవిని, రాజదండంలో విశ్వక్సేనుడిని, చామరలో వైనతేయుడు, గరుత్మంతుడు, ఖడ్గంలో నందకుడు, స్వర్ణఛత్రంలో అనంతుడు, పాదుకల్లో ఆదిశేషుడు, దేవేరులు ధరించే ఆభరణాల్లో భూదేవిని ఆవాహన చేశారు. మండపత్రయ ఆరాధాన ముగిసిన తర్వాత శ్రీరాముడికి అష్టోత్తర శతనామార్చన చేశారు. అనంతరం త్రిదండి దేవనాథ జీయర్‌స్వామి ఆనాటి శ్రీరాముడి పాలన విశిష్టతలను వివరించారు.

సిరియ తిరువుడి పట్టాభిషేకం..

వాల్మీకి రామయాణంలో పట్టాభిషేకానికి ముందు రోజు శ్రీరాముడు అయోధ్యను వదిలి వనవాసానికి వెళ్లారు. దీంతో ముందుగా శ్రీరాముడి పాదుకలకు పట్టాభిషేకం జరిగింది. ఆ తర్వాత రామయణ క్రమంలో సుగ్రీవుడికి, విభీషణుడికీ పట్టాభిషేకాలు జరిగాయి. ఆ తర్వాతే శ్రీరామ పట్టాభిషేకం జరిగింది. అయితే విష్ణువుకు అన్ని అవతారాల్లోనూ గరుత్మంతుడు సేవలు అందించగా రామావతారంలో మాత్రం హనుమంతుడు సేవ చేశాడు. దీంతో గరుత్మంతుడిని పెరియ తిరువుడిగా, హనుమంతుడిని సిరియ తిరువుడిగా కొలుస్తారు. శ్రీరాముడి పాదుకలతో మొదలైన పట్టాభిషేక మహోత్సవం సిరియ తిరువుడైన హనుమంతుడి పట్టాభిషేకంతో ముగిసింది.

పట్టువస్త్రాలు సమర్పించిన గవర్నర్

శ్రీరామ పట్టాభిషేక మహోత్సవానికి ప్రభుత్వం తరపున గవర్నర్ పట్టువస్త్రాలు అందించడం ఆనవాయితీ. ఈ క్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరయ్యారు. ఉదయం 10 గంటల సమయంలో హెలీకాప్టర్ ద్వారా సారపాకలోని ఐటీసీ ప్రాంగణానికి చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా నేరుగా ప్రధాన ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం పట్టాభిషేకం జరిగే అయోధ్యాపురికి చేరుకుని పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, భద్రాచలం, ఇల్లెందు ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్, ఆలయ ఈఓ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రాజ లాంఛనాలతో పట్టాభిషేకం..

పట్టాభిషేక రాజ లాంఛనాల అలంకరణ మధ్యాహ్నం 12 గంటలకు మొదలైంది. ముందుగా రాజదండాన్ని శ్రీరాముడి కుడిచేతిలో ఉంచారు. ఆ తర్వాత రాజముద్రిక తొడిగారు. రామదాసు చేయించిన పచ్చల పతకాన్ని శ్రీరాముడికి, చింతాకు పతకాన్ని సీతాదేవికి, రామమాడను లక్ష్మణుడికి అలంకించారు. శ్రీరాముడికి ఇరువైపులా చామరాలు ఉంచి, ఆపై స్వర్ణఛత్రాన్ని స్థిరం చేశారు. చివరగా రాజఖడ్గాన్ని రామయ్య ఎడమ చేతిలో ధరింపజేశారు. స్వర్ణ ఛత్రం నీడలో రాజముద్రిక, రాజదండం, రాజఖడ్గం ధరించిన తర్వాత పట్టాభిషేకం కార్యక్రమాన్ని రుత్విక్కులు ప్రారంభించారు. మండపత్రయంలోని మూడు కలశాల్లోని సమస్త దేవతలు, సమస్త జలాలు, రామపరివారంతో కూడిన మంత్రించిన జలాన్ని శ్రీరాముడిపై ప్రోక్షణ చేస్తూ పట్టాభిషేకం కార్యక్రమాన్ని జరిపి చివరగా మంగళహారతి సమర్పించారు.



పట్టాభిషేకాన్ని తిలకిస్తున్న గవర్నర్, మంత్రి తుమ్మల, కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు



న్యూస్‌రీల్

మోడల్ కెరీర్ సెంటర్‌లో రేపు జాబ్‌మేళా

ఖమ్మం రాపర్తినగర్: ఖమ్మం టేకులపల్లిలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో ఈనెల 9వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి ఎన్.మాధవి తెలిపారు. అపోలో ఫార్మా కంపెనీ బాధ్యులు పాల్గొని ఫార్మసిస్ట్, ట్రైనింగ్ ఫార్మసిస్ట్, ఫార్మసిస్ట్ అసిస్టెంట్ పోస్టులకు అర్హులకు ఎంపిక చేస్తారని వెల్లడించారు. ఆయా పోస్టులకు అర్హత కలిగిన అభ్యర్థులు సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో బుధవారం ఉదయం 10గంటలకల్లా హాజరుకావాలని సూచించారు.

నేడు యూడీఐడీ శిబిరం

ఖమ్మంవైద్యవిభాగం: దివ్యాంగులకు సదరమ్ సర్టిఫికెట్ల స్థానంలో యూనిక్ డిసేబులిటీ ఐడెంటిటీ కార్డు(యూడీఐడీ)లు జారీ చేయనుండగా, మంగళవారం ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ప్రత్యేక క్యాంపు ఏర్పాటుచేశారు. ఈ కార్డులు జారీ చేయాలన్న ఆదేశాలతో కొంతకాలంగా సదరమ్ క్యాంపులు నిలిపివేశారు. ఈమేరకు తొలిసారి మంగళవారం ఏర్పాటుచేస్తున్న క్యాంప్‌లో 80 మంది దివ్యాంగులకు పరీక్షలు నిర్వహిస్తామని ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్ తెలిపారు. ఇందులో అర్హత సాధించిన వారికి కార్డులు జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఆరోగ్యకరమైన జీవనశైలి తప్పనిసరి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ కళావతిబాయి

ఖమ్మంవైద్యవిభాగం: అనారోగ్యం దరిచేరవద్దంటే ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని డీఎంహెచ్‌ఓ కళావతిబాయి సూచించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, నిత్యం వ్యాయామాన్ని అలవాటు చేసుకోవాలని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మాతా, శిశు సంరక్షణ కోసం ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలను బలోపేతం చేస్తూ సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. గర్భిణులకు మెరుగైన వైద్యం అందిస్తూ ప్రమాదాల నుంచి తప్పించడం, నాణ్యమైన సేవలందించేందుకు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం రోజున ప్రతిన బూనాలని చెప్పారు. ఈసమావేశంలో వివిధ విభాగాల అధికారులు సైదులు, చందునాయక్, వి.సుబ్రహ్మణ్యం, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థికి మూడు పుస్తకాలు



విద్యార్థితో పాఠం చదివిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

- సెలవుల్లో చదువుకునేలా ప్రత్యేక దృష్టి
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

వైరా: వేసవి సెలవుల్లో ప్రతీ విద్యార్థికి పాఠశాల నుండి మూడు పుస్తకాలు అందించాలని, తద్వారా సెలవుల్లోనూ చదువుపై ఆసక్తి తగ్గకుండా చూడొచ్చని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. అంతేకాక ఉపాధ్యాయులు విద్యార్థుల్లో ఇంగ్లిష్‌పై భయం తగ్గించి, భవిష్యత్ లక్ష్యాలను ఏర్పాటు చేసుకునేలా చూడాలని సూచించారు. వైరాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం తనిఖీ చేసిన ఆయన మాట్లాడుతూ వచ్చే విద్యాసంవత్సరంలో అన్ని పాఠశాలల్లో రీడింగ్ క్లబ్‌లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆరో తరగతిలో విద్యార్థులతో ఇంగ్లిష్ పాఠం చదివించగా, ఒకరు సరిగ్గా చదవకపోవడంతో ఇంగ్లిష్ అంటే భయం విడనాడాలని సూచించారు. అలాగే, క్రీడల్లో ఆసక్తి పెరిగేలా పాఠశాలలో క్రికెట్, వాలీబాల్ కోర్టులు ఏర్పాటు చేయిస్తామని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉండటంతో హెచ్‌ఎంపై అసహనం వ్యక్తం చేశారు. ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ కే.వీ.శ్రీనివాస్, హెచ్‌ఎం మాధవరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు 8వ తరగతి నుంచే కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డితో కలిసి లైబ్రరీ, రీడింగ్ క్లబ్‌ల ఏర్పాటు, మా పాప – మా ఇంటి మణి దీపం, సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాలపై సమీక్షించారు. విద్యార్థులు భవిష్యత్ లక్ష్యాలు నిర్దేశించుకునేలా కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు ఉపయోగపడతాయని తెలిపారు. అలాగే, సన్నబియ్యం లబ్ధిదారుల ఇళ్లలో ఆడపిల్ల పుడితే వారితో కలిసి అధికారులు భోజనం చేయాలన్నారు. ఈసమావేశంలో డీఆర్వో ఏ.పద్మశ్రీ, డీఆర్‌డీఓ ఎన్.సన్యాసయ్య, కలెక్టరేట్ ఏఓ అరుణ పాల్గొన్నారు.

పెండింగ్ ఫిర్యాదులు పరిష్కరించండి

- ప్రతీ శుక్రవారం గ్రీవెన్స్ దరఖాస్తులపై సమీక్ష
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సహకారనగర్: కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణిలో ప్రజలు ఇచ్చే ప్రతీ ఫిర్యాదును పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన గ్రీవెన్స్ డేలో ఆయన అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమావేశమైన కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ శుక్రవారం ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై సమీక్ష ఉంటుందని, అధికారులు నివేదికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఏవైనా దరఖాస్తులను తిరస్కరిస్తే అందుకు కారణాలను ప్రజలకు వివరించాలే తప్ప పదేపదే తిప్పించుకోవద్దని సూచించారు. ప్రజావాణి ద్వారా వివిధ శాఖలకు 300పైగా దరఖాస్తులు పంపితే 151మాత్రమే పరిష్కారమయ్యాయని, సీపీఓ, డీఆర్‌డీఓ, మున్సిపల్ శాఖ, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖల వద్ద ఎక్కువ పెండింగ్ ఉన్నందున దృష్టి సారించాలని సూచించారు. డీఆర్వో పద్మశ్రీ, డీఆర్‌డీఓ సన్యాసయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ బండ.. భారం



- పెరిగిన గృహావసరాల సిలిండర్ ధరలు
- ఒక్కో సిలిండర్‌పై రూ.50 అదనం

ఖమ్మం సహకారనగర్: కేంద్ర పెట్రోలియం శాఖ నిర్ణయంతో సామాన్యులపై భారం పడనుంది. సుమారు రెండేళ్ల తర్వాత ఒకేసారి గృహావసరాల గ్యాస్ సిలిండర్ ధర రూ.50పెంచుతూ సోమవారం నిర్ణయాన్ని వెలువరించారు. అయితే, ఈ నిర్ణయం సోమవారం అర్ధరాత్రి నుంచే అమలవుతుందని కొందరు చెబుతున్నా... ఇంకొందరు డీలర్లు మాత్రం తమకు స్పష్టమైన ఆదేశాలు రాలేదని చెప్పడం గమనార్హం.

4లక్షలకు పైగా కనెక్షన్లు

జిల్లాలో వివిధ కంపెనీలకు సంబంధించి 33 గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. వీటి పరిధిలో 4,20,713 గ్యాస్ కనెక్షన్లు ఉండగా, సింగిల్ సిలిండర్ కనెక్షన్లు 2,14,988, డబుల్ సిలెండర్ల కనెక్షన్లు 1,03,876తో పాటు దీపం పథకం ద్వారా 78,456, సీఎస్ఆర్ పథకం కింద జారీ చేసిన 23,393 కనెక్షన్లు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం రూ.834గా ఉన్న సిలిండర్ ధరను రూ.50పెంచడంతో రూ.884కు చేరుతుంది. ఇక రూ.1,929.50గా ఉన్న వాణిజ్య అవసరాల సిలిండర్ ధరలో లాంటి మార్పు చేయలేదు.

నెలకు రూ.15కోట్లకు పైగా భారం

పెరిగిన ధరలు సోమవారం అర్ధరాత్రి నుంచే అమల్లోకి వస్తాయని చెబుతున్నారు. జిల్లాలోని 4లక్షల మందికి పైగా వినియోగదారుల్లో 3లక్షల మంది నెలకోసారి సిలిండర్ వినియోగించినా రూ.50చొప్పున రూ.15కోట్ల భారం అదనంగా పడడం ఖాయమని తెలుస్తోంది. కానీ డీలర్లు మాత్రం కొత్త ధర అమలుపై స్పష్టత ఇవ్వడం లేదు. కాగా, పెరిగిన ధరలకు అనుగుణంగా వినియోగదారులకు ఇచ్చే సబ్సిడీని కేంద్రప్రభుత్వం సవరిస్తుందని కొందరు చెబుతున్నారు. ఇక రాష్ట్రప్రభుత్వం రూ.500కే కొందరికి సిలిండర్ ఇస్తోంది. వీరి పరిస్థితి ఏమిటో కూడా స్పష్టత రావాల్సి ఉంది.

మధ్యాహ్నం ఎండ.. సాయంత్రం వాన



సత్తుపల్లిలో కురుస్తున్న వర్షం (ఇన్‌సెట్) వడగండ్లు

- జిల్లాలోని పలు ప్రాంతాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత
- కొన్నిచోట్ల ఈదురుగాలులు, వడగండ్ల వర్షం

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో సోమవారం భిన్నమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. పలుచోట్ల మధ్యాహ్నం గరిష్ట స్థాయిలో ఉష్ణోగ్రత నమోదు కాగా.. సాయంత్రం తర్వాత ఇంకొన్ని ప్రాంతాల్లో వర్షం కురిసింది. గడిచిన వారంతో పోలిస్తే సోమవారం ఉష్ణోగ్రతలు పెరిగి అనేక ప్రాంతాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఖమ్మం ప్రకాష్‌నగర్‌లో అత్యధికంగా 40.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, ముదిగొండ మండలం పమ్మిలో 40.3, కొణిజర్లలో 40.2, వైరా, రఘునాథపాలెం, ఖమ్మం ఖానాపురం, మధిరలో 40.1 డిగ్రీలుగా ఉష్ణోగ్రత ప్రభావం చూపింది.

సాయంత్రం తర్వాత మార్పులు

పలు ప్రాంతాల్లో వాతావరణంలో సాయంత్రం తర్వాత మార్పులు చోటు చేసుకున్నాయి. సత్తుపల్లితో పాటు వైరా, వేంసూరు, సత్తుపల్లి, ఎర్రుపాలెం మండలాల్లో వర్షం కురిసింది. వైరాలో 11.8, వేంసూరు 9, సత్తుపల్లి 7.8, ఎర్రుపాలెంలో 5 మి.మీ.ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. సత్తుపల్లిలో వడగళ్ల వాన కురవగా రైతులు ఆందోళన చెందారు. ఇక రాత్రి ఖమ్మంలోనూ ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడా వర్షపు జల్లులు కురిశాయి. ఈ కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అయితే, వర్షంతో వరి, మొక్కజొన్న కోతలు పూర్తిచేసిన రైతులే కాక మామిడి తోటల యజమానులు ఆందోళనకు గురయ్యారు.



ఎర్రుపాలెంలో విద్యుత్ లైన్‌పై విరిగిపడిన వేపచెట్టు

చల్లబడిన వాతావరణం

సత్తుపల్లి/ఎర్రుపాలెం: సత్తుపల్లి మండలంలో సోమవారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఈదురుగాలులకు తోడు పలు చోట్ల వనగండ్ల వాన కురిసింది. దీంతో మామిడి కాయలు నేలరాలగా, వివిధ ప్రాంతాల్లో ధాన్యం, మిర్చి తడిసిపోయాయి. ఇక తీగలు తెగడం, లైన్లపై చెట్ల కొమ్మలు పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడగా సిబ్బంది మరమ్మతుల్లో నిమగ్నమయ్యారు. కాగా, ఎర్రుపాలెం మండలంలోని పలు గ్రామాల్లోనూ వర్షం కురిసింది. కొన్నిచోట్ల మామిడికాయలు నేలరాలాయి. మిర్చి, ధాన్యం రైతులు పంట తడవకుండా పట్టాలు కప్పుకున్నారు. ఇక కేశిరెడ్డిపల్లిలో రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి.

చిన్నారుల పోషణపై ప్రత్యేక దృష్టి

కొణిజర్ల: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల్లో పోషకాహార లోపం ఎదురుకాకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూనే కేంద్రాల్లో పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ వరంగల్ రీజియన్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి సూచించారు. కొణిజర్ల – 2, 4 అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం తనిఖీ చేసిన ఆమె పిల్లల బరువు, ఎత్తు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. కేంద్రాలకు చిన్నారులు వంద శాతం హాజరయ్యేలా చూడాలని తెలిపారు. సీడీపీఓ కమలప్రియ, ఉద్యోగులు కొమ్మినేని బాబు, కె.జ్యోతి, షాలిని తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్‌జేడీ ఝాన్సీలక్ష్మీబాయి

క్లుప్తంగా

సంఘాల నాయకులతో నేడు సమావేశం

ఖమ్మంమయూరిసెంటర్: రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల తీరుతెన్నులను వివరించేందుకు మంగళవారం కుల సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటుచేస్తున్నట్లు బీసీడబ్ల్యూఓ జి.జ్యోతి తెలిపారు. కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో జరిగే సమావేశానికి బ్రాహ్మణ, కమ్మ, కరణం, రెడ్డి, వెలమ, వైశ్య, ఓబీసీ, బీసీ, ఎంబీసీ ఫెడరేషన్ సంఘాల నాయకులు హాజరుకావాలని కోరారు.

ఎంఈఓ, ప్రిన్సిపాల్ సహా ముగ్గురికి షోకాజ్ నోటీసు

వైరా: వైరాలోని గురుకుల బాలికల పాఠశాలలో మెనూ సక్రమంగా అమలుచేయడం లేదని తేలడంతో ప్రిన్సిపాల్, ఉద్యోగితో పాటు ఎంఈఓకు షోకాజ్ నోటీసులు జారీచేశారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదివారం సాయంత్రం పాఠశాలను తనిఖీ చేయగా మెనూ పాటించడం లేదని గమనించి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సోమవారం అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ గురుకులానికి చేరుకుని విచారణ చేపట్టారు. మెనూ ప్రకారం ఆదివారం నాన్‌వెజ్ అందించాల్సి ఉన్నా ఎందుకు సమకూర్చలేదని ఆరాతీయగా బర్డ్ ఫ్లూ భయంతో అందించలేదని ప్రిన్సిపాల్ రమ, ఏటీపీ రోహిణి బదులిచ్చారు. దీంతో వీరికే కాక పర్యవేక్షణ లోపం ఉన్న కారణంగా ఎంఈఓ కె.వెంకటేశ్వరరావుకు డీఈఓ ద్వారా షోకాజ్ నోటీసులు జారీ చేయించారు.

కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఖమ్మం సహకారనగర్: జిల్లాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని సైన్స్ విద్యార్థులకు ఇస్తున్న ఉచిత ఎప్‌సెట్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ పి.శ్రీజ సూచించారు. ఖమ్మం అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలను సందర్శించిన ఆమె శిక్షణకు హాజరైన విద్యార్థులతో మాట్లాడారు. డీఐఈఓ కె.రవిబాబు, కోఆర్డినేటర్ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రానికి స్థలం, భవన నిర్మాణం



భూమి పూజ చేస్తున్న సుభాష్ కుటుంబీకులు

మధిర: మండలంలోని మహదేవపురానికి చెందిన రిటైర్డ్ ప్రిన్సిపల్ పుతుంబాక సుభాష్ తన తల్లిదండ్రులు రామసీతమ్మ - పురుషోత్తం పేరిట ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణానికి ఐదు సెంట్ల స్థలం వితరణగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థలం ఇవ్వడమే కాక ఆరోగ్య ఉపకేంద్ర భవనం తామే నిర్మించేలా సోమవారం భూమి పూజ చేశామని వెల్లడించారు. 'పుతుంబాక రామసీతమ్మ పల్లె దవాఖానా'గా నిర్మించి ప్రభుత్వానికి అప్పగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, డాక్టర్ చావా భాస్కరరావు, డాక్టర్ వాసిరెడ్డి శివలింగ ప్రసాద్, పార్వతవర్థిని, కర్నాటి రామారావు, మంతరావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

వీసీలో ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

హన్మకొండ: ఈదురు గాలులు, భారీ వర్షాలు ఉన్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో గోదావరి పరీవాహక ప్రాంతాల విద్యుత్ అధికారులు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి సూచించారు. హనుమకొండలోని టీజీఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి సోమవారం ఆయన 16 సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలు, ఏడీఈలు, ఏఈలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. భద్రాద్రి కొత్తగూడెం, భూపాలపల్లి పరిధిలో ఎప్పటికప్పుడు విద్యుత్ సరఫరాను పరిశీలిస్తూ అంతరాయం ఎదురైతే వెంటనే పునరుద్ధరించాలని ఆదేశించారు. చెట్లు విరిగి విద్యుత్ లైన్లపై పడినా, ట్రిపింగ్, బ్రేక్‌డౌన్లు వచ్చినా త్వరగా పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే, పంట కోతలు జరుగుతున్నందున పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ సర్వీసుల మంజూరులో వేగం పెంచాలని, అవసరమైన చోట 63 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని సీఎండీ ఆదేశించారు.

నవమితో ఆర్టీసీకి ఆదాయం

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో ఈ నెల 6, 7వ తేదీల్లో జరిగిన శ్రీ రామనవమి, పట్టాభిషేకం సందర్భంగా ఆర్టీసీ వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడిపింది. దీంతో భద్రాచలం డిపోకు సుమారు రూ.9.5 లక్షల ఆదాయం పెరిగింది. సాధారణంగా భద్రాచలం డిపో పరిధిలో రోజూ 92 సర్వీసులు నడుపుతుండగా, రూ.23 లక్షల వరకు ఆదాయం వస్తుంది. శ్రీరామనవమి సందర్భంగా 5న అదనంగా మరో 26 సర్వీసులు తిప్పగా రూ.3 లక్షల మేర ఆదాయం పెరిగింది. 6న అదనంగా 30 సర్వీసులు నడపగా రూ.4.50 లక్షలు, 7వ తేదీన అదనంగా 16 సర్వీసులు నడపగా రూ.2 లక్షల వరకు ఆదాయం పెరిగినట్లు అధికారులు వెల్లడించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.21,000

కాలేజీ ఇక యూనివర్సిటీ

- 'గూడెం' ఇంజనీరింగ్ కాలేజీ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా అప్‌గ్రేడ్
- కాకతీయ యూనివర్సిటీ నుంచి విడిపోయి స్వయంప్రతిపత్తి
- త్వరలోనే ఖమ్మం పీజీ సెంటర్ కూడా ఇదే పరిధిలోకి?



కొత్తగూడెంలోని ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలను ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయంగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఇటీవల జీఓ జారీ చేసింది. ఈ కళాశాల దాదాపు 400 ఎకరాల్లో విస్తరించి ఉండగా 300ఎకరాల్లో యూనివర్సిటీ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ కోసం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పలుమార్లు సీఎంకు వినతులు ఇవ్వగా ఆయన కృషి ఫలించినట్లయింది. రాష్ట్ర విద్యార్థులు ఇన్నాళ్లూ ఎర్త్ సైన్సెస్ కోర్సులు చదవాలంటే సెంట్రల్ యూనివర్సిటీలకు వెళ్లాల్సి వచ్చేది. 2025-2026 విద్యాసంవత్సరం నుంచే యూనివర్సిటీ అంబాటులోకి రానుండడంతో విద్యార్థుల ఇక్కట్లు తీరనున్నాయి.

పరిశోధనలకు అనువుగా..

ఇతర ప్రాంతాలతో పోలిస్తే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వాతావరణం కొంత వేరుగా ఉంటుంది. ఇక్కడ ఎండ, వాన, చలి అన్నీ ఎక్కువే. యూనివర్సిటీ ఏర్పాటు, కొత్త కోర్సులు అందుబాటులోకి రానుండడంతో అలాంటి వాటిపై అధ్యయనం చేసే అవకాశం విద్యార్థులకు దక్కనుంది. సహజ వనరులకు నెలవైన కొత్తగూడెంలో యూనివర్సిటీ ఏర్పాటుతో అంతర్జాతీయ ఖ్యాతి లభించనుంది. దేశంలోనే మొట్టమొదటి ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ జిల్లాకు మంజూరవడంతో విద్యార్థులు, అధ్యాపకులు సోమవారం సంబురాలు జరుపుకున్నారు. కొత్తగూడెం ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు, ప్రస్తుతం సింగరేణితో పాటు వివిధ కంపెనీల్లో పని చేస్తున్న వారు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కేయూ నుంచి విడిపోనున్న ఇంజనీరింగ్ కాలేజీ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని కొత్తగూడెం మైనింగ్ ఇంజనీరింగ్ కాలేజీని ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేయడంతో ఈ కాలేజీ కేయూ నుంచి విడిపోనుంది. 1978లో స్కూల్ ఆఫ్ మైన్స్‌గా ఓయూ పరిధి నుంచి కొత్తగూడెంలో పీజీ సెంటర్ ఏర్పాటైంది. తొలినాళ్లలో బీఈ మైనింగ్‌తో పాటు ఎమ్మెస్సీ జియాలజీ కోర్సులు ఉండగా, కేయూ ఏర్పాటయ్యాక 1996లో ఈ పరిధిలోకి చేర్చి యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్‌గా మార్చారు. ఆ సమయాన ఈఈఈ, సీఎస్ఈ కోర్సులు, 2010లో ఐటీ, ఈసీఈ కోర్సులు అందుబాటులోకి తీసుకొచ్చినా మధ్యలో ఎమ్మెస్సీ జియాలజీ కోర్సు తొలగించారు. ఇప్పుడు కేయూ నుంచి విడిపోతున్నందున బోధన, బోధనేతర పోస్టులే కాక కాలేజీ ఆస్తులన్నీ బదలాయిస్తారు. ఇక కొత్తగూడెం ఇంజనీరింగ్ కాలేజీలో నియామకమైన అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ బిక్షాలు, డాక్టర్ వెంకటరమణ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ రాధిక, డాక్టర్ సుమలత కేయూలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం వీరి డిప్యూటేషన్లు రద్దు చేస్తారా, లేక ఆప్షన్ ఇస్తారా అన్నది తేలాల్సి ఉంది. కాగా, ఖమ్మంలోని కేయూ పీజీ సెంటర్‌ను సైతం కొత్తగూడెం ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీలోకి బదలాయించే అవకాశముందని చర్చ జరుగుతోంది.

జమలాపురంలో ముగిసిన బ్రహ్మోత్సవాలు



ఎర్రుపాలెం : చక్రస్నానం జరిపిస్తున్న అర్చకులు

శ్రీ వారికి చక్రస్నానం, మహా పూర్ణాహుతి

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. ఈసందర్భంగా యాగశాలలో ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, పలువురు అర్చకులు మహా పూర్ణాహుతి నిర్వహించి ధ్వజపతాకాన్ని అవతనం చేశారు. ఆతర్వాత ఆలయ ప్రాంగణంలోని పుష్కరిణిలో చక్రస్నానం జరిపించారు. ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, పుష్కరిణి నిర్మాణ దాత గుదే వెంకటేశ్వరరావు దంపతులు, సూపరింటెండెంట్ విజయకుమారి, ముఖ్య అర్చకులు మురళీమోహన్‌శర్మ, రాజీవ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

ముత్తారంలో పట్టాభిషేకం



ముదిగొండ : ముత్తారంలో శ్రీరామ పట్టాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

ముదిగొండ: ముదిగొండ మండలం ముత్తారంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో సోమవారం శ్రీరామ పట్టాభిషేకం ఘనంగా ఘనంగా నిర్వహించారు. ఉదయం 7గంటలకే ప్రత్యేక పూజలు మొదలుపెట్టగా, చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అర్చకులు బొర్రా వాసుదేవాచార్యులు ఆధ్వర్యాన పట్టాభిషేకం ముగిశాక తిరువీధి సేవ నిర్వహించారు. వంశపారంపర్య ధర్మకర్త వనం వెంకటనాగేశ్వరరావు, స్థలదాత కంకిపాటి హన్మంతరావు, ఆలయ చైర్మన్ తుళ్లూరి జీవన్, పాలకమండలి సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

కుండల్లో నీరు నింపారు..

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలో కేఎంసీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన చలివేంద్రాల్లో తాగునీరు అందుబాటులోకి వచ్చింది. 'కుండలు సరే.. తాగునీరు ఏది' శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి కేఎంసీ అధికారులు స్పందించారు. ఈమేరకు అన్ని చలివేంద్రాల్లో కుండలను శుభ్రం చేయించి తాగునీరు నింపారు. అంతేకాక ప్రతిరోజు కుండల్లో నీరు నింపాలని సిబ్బందికి కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాలు జారీచేశారు.



54వ డివిజన్‌లోని చలివేంద్రం కుండల్లో నీరు నింపుతున్న సిబ్బంది

ముగ్గురిపై హత్యాయత్నం కేసు కొట్టివేత

హైకోర్టు తీర్పును ధ్రువపర్చిన సుప్రీం కోర్టు

ఖమ్మంలీగల్: రఘునాథపాలెం మండలం మంచుకొండకు చెందిన ముగ్గురిపై నమోదైన హత్యాయత్నం, నేరపూరిత కుట్ర, భారత ఆయుధచట్టం అభియోగాల కింద దాఖలైన కేసును తెలంగాణ హైకోర్టు కొట్టివేయగా.. ఆ తీర్పును సుప్రీంకోర్టు ధ్రువపర్చింది. ఈమేరకు సుప్రీంకోర్టు జస్టిస్ ఎం.ఎం.సుందరేష్, జస్టిస్ రాజేశ్ బిందాల్‌తో కూడిన ధర్మాసనం సోమవారం వెలువరించిన తీర్పు వివరాలిలా ఉన్నాయి. భూమి సరిహద్దు తగాదాల విషయమై తనను హత్య చేసేందుకు మంచుకొండ వాసులైన మందడపు సుధాకర్, మందడపు మాధవరావు, యల్లంపల్లి హన్మంతరావు కుట్ర పన్నారని స్థిరాస్తి వ్యాపారి తుళ్లూరు శ్రీనివాసరావు 2021 ఆగస్టు 8న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందు కోసం రౌడీషీటర్లు బైరు వెంకన్న, దొడ్డా హరీష్, ధర్మవరపు సర్వేష్‌కు రూ.30వేల నగదు ఇవ్వడమే కాక రెండు పెద్ద కొడవళ్లను సమకూర్చారని పేర్కొనగా, ఖమ్మం ఖానాపురం హవేలీ పోలీసులు కేసు నమోదు చేసి నిందితులపై 2022 మే 4న కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఫిర్యాది శ్రీనివాసరావుకు ఎలాంటి గాయాలు కాకపోగా, కేసు ఖమ్మం మొదటి అదనపు అసిస్టెంట్ సెషన్స్ కోర్టులో విచారణకు వచ్చింది. ఇంతలోనే చార్జిషీట్‌ను సవాల్ చేస్తూ ముగ్గురు నిందితులు హైకోర్టులో క్రిమినల్ పిటిషన్ దాఖలు చేయడంతో ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు ముగ్గురిపై అభియోగాలను రద్దు చేయడమే కాక కేసు కొట్టివేస్తూ గత ఏడాది మే 2న తీర్పు వెలువరించింది. అయితే, ఈ తీర్పును సవాల్ చేస్తూ ఫిర్యాది శ్రీనివాసరావు సుప్రీం కోర్టులో క్రిమినల్ పిటిషన్ దాఖలు చేశారు. ఇరుపక్షాల వాదనలు విన్నాక సుప్రీంకోర్టు తమ గత తీర్పుల్లోని న్యాయసూత్రాలు, రాష్ట్ర హైకోర్టు తీర్పును పరిశీలించి ముగ్గురిపై కేసు కొట్టివేస్తూ హైకోర్టు తీర్పును ధ్రువపర్చింది. ఈ కేసు జిల్లాలో రాజకీయంగా అప్పట్లో తీవ్ర సంచలనం కలిగించింది. కాగా, నిందితుల తరఫున సుప్రీం కోర్టులో సీనియర్ న్యాయవాదులు సీహెచ్.వెంకటరమణ, డి.సోమయాజులు వాదించగా.. ఖమ్మం కోర్టులో సీనియర్ న్యాయవాది కిలారు బాబ్జీ వాదించారు.

సమష్టి కృషితోనే విజయవంతం

భద్రాచలంటౌన్/భద్రాచలంఅర్బన్ : జిల్లా అధికారులు, ఉద్యోగుల సమష్టి కృషితోనే శ్రీరామనవమి, పట్టాభిషేకం వేడుకలు విజ యవంతం అయ్యాయని దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్ అన్నారు. సోమవారం భద్రాచలంలో ఆయన మాట్లాడుతూ.. సుదూర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వచ్చినా ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులు సౌకర్యాలు కల్పించారని అభినందించారు. ఎంతో ప్రాముఖ్యత ఉన్న స్వామివారి తలంబ్రాలు కొరియర్, పోస్టల్, కార్గో ద్వారా పొందే అవకాశం ఉన్నందున భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగా, వేడుకలు అత్యంత వైభవోపేతంగా జరగడం పట్ల కలెక్టర్ జితేష్ వి.పాటిల్ హర్షం వ్యక్తం చేశారు. తమ సలహాలు, సూచనలు పాటిస్తూ వేడుకల విజయవంతానికి సహకరించిన వారందరినీ అభినందించారు. అలాగే వేడుకల్లో సమర్థంగా విధులు నిర్వర్తించిన 21మంది ఎంపీఓలు, 101 మంది పంచాయతీ కార్యదర్శులను డీపీఓ చంద్రమౌళి అభినందించారు. పట్టాభిషేకం పూర్తయ్యాక గ్రామపంచాయతీ కార్యాలయంలో వారందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు.

ప్రారంభమైన మూల్యాంకనం

ఖమ్మం సహకారనగర్: పదో తరగతి జవాబుపత్రాల మూల్యాంకనం ఖమ్మంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో సోమవారం ప్రారంభమైంది. ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు వాల్యూయేషన్ నిర్వహిస్తుండగా... డీఈఓ సోమశేఖరశర్మ క్యాంపు ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్నారు. అలాగే, డిప్యూటీ క్యాంపు ఆఫీసర్ ఎం.శ్రీనివాస్, ఖమ్మం అర్బన్ ఎంఈఓ శైలజాలక్ష్మి రిపోర్టింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. కాగా, స్పాట్ వాల్యూయేషన్‌కు 650మంది ఉపాధ్యాయులు అవసరమైతే, కీలక సబ్జెక్టులైన సోషల్, ఇంగ్లిష్, బయాలజీ, హిందీ స్కూల్ అసిస్టెంట్లు 78మంది తక్కువగా ఉన్నారు. ఈక్రమాన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యాయులకు విధులు కేటాయిస్తున్నట్లు డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. తొలిరోజు 650మందికి గాను 80వరకు రిపోర్టు చేయలేదని, మంగళవారం కూడా రిపోర్టు చేయని వారికి షోకాజ్ నోటీసులు ఇస్తామని వెల్లడించారు.

'సహజీవనం' జంట ఘర్షణ

మహిళ చేతిలో వ్యక్తి హతం



రవిప్రసాద్ (ఫైల్)

ఖమ్మంఅర్బన్: భార్యాపిల్లలకు దూరంగా ఆయన, భర్తను వదిలేసిన ఈమె ఇద్దరూ కలిసి సహజీవనం చేస్తున్నారు. ఇద్దరి మధ్య ఎందుకు గొడవ జరిగిందో తెలియదు కానీ సదరు మహిళ చేతిలో ఆ వ్యక్తి హతమయ్యాడు. ఖమ్మం నేతాజీనగర్‌లో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. ఏపీ రాష్ట్రంలోని ఏలూరు జిల్లా చింతలపుడి మండలం ప్రగడవరానికి చెందిన కోసన రవిప్రసాద్(53)కు భార్య, ఇద్దరు పిల్ల లు ఉన్నారు. అదే జిల్లా సూరంపాలెంకు చెందిన లావణ్యకు ఓ కుమారుడు ఉండగా భర్తతో విడిపోయి కొన్నాళ్లుగా రవితో సహజీవనం చేస్తోంది. ఏడాదిన్నర పాటు సత్తుపల్లిలో ఉన్న ఈ జంట ఐదు నెలల క్రితం ఖమ్మం నేతాజీనగర్‌కు మకాం మార్చారు. రవిప్రసాద్ రియల్ ఎస్టేట్ వ్యాపారం, లావణ్య టైలరింగ్‌తో జీవనం సాగిస్తున్నారు. ఆదివారం రాత్రి వీరి మధ్య ఘర్షణ జరగగా లావణ్యను రవిప్రసాద్ తీవ్రంగా కొట్టినట్లు తెలిసింది. దీంతో ఆమె రవిని నెట్టివేయగా తల వెనుకభాగం గోడను బలంగా తాకిందని సమాచారం. ఆపై బనీన్‌ను ఒడిసి పట్టుకోవడంతో మెడకు బిగుసుకుని ఆయన మృతి చెందినట్లు తెలుస్తోంది. దీంతో ఆయన కింద పడగానే 108లో ఆస్పత్రికి తరలించగా అప్పటికే రవి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తలవెనక భాగం, నుదుటన గాయాలు ఉండడంతో ఖమ్మం అర్బన్ పోలీసులు లావణ్యను అదుపులోకి తీసుకుని మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. కాగా, లావణ్యే ఉరి వేసి రవిప్రసాద్‌ను హతమార్చిందని ఆయన కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ భానుప్రకాష్ తెలిపారు. కాగా, ఘర్షణ జరిగే క్రమాన నెట్టేసరికి గోడకు తగిలాక రవి కింద పడ్డాడని, అంతకు మించి ఏమీ జరగలేదని లావణ్య పోలీసులకు వివరించినట్లు తెలిసింది.

శ్రీరామనవమి ఊరేగింపులో ఇరువర్గాల ఘర్షణ

పలువురికి గాయాలు, 14 మందిపై కేసు

తిరుమలాయపాలెం: మండలంలోని జల్లెపల్లిలో శ్రీరామనవమి ఊరేగింపు సందర్భంగా ఇరువర్గాల మధ్య ఘర్షణ జరగగా, పోలీసులు సోమవారం 14మందిపై కేసు నమోదు చేశారు. జల్లెపల్లిలో ఆదివారం రాత్రి సీతారామచంద్రస్వామి ఊరేగింపు నిర్వహిస్తుండగా పాతకక్షలతో ఇరు వర్గాల వారు కర్రలతో దాడులకు పాల్పడ్డారు. ఇరువర్గాలకు చెందిన ఈడబోయిన విజయ, దుర్గాభవాని, సునీత, మల్సూర్, బాదరబోయిన వీరన్నకు గాయాలవడంతో ఎస్ఐ కూచిపూడి జగదీష్ సిబ్బందితో వెళ్లి పరిస్థితులు అదుపులోకి తీసుకొచ్చారు. గ్రామంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య గతంలో ఉన్న గొడవల కారణంగా ఈ ఘర్షణ రాజకీయ రంగు పులుముకుంది. ఈమేరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పికెట్ నిర్వహిస్తుండడమే ఇరువర్గాల నుంచి అందిన ఫిర్యాదుతో 14మందిపై కేసు నమోదు చేశారు.

రైస్ మిల్లులో తప్పిన ప్రమాదం

నేలకొండపల్లి: మండలంలోని గువ్వలగూడెం సమీపాన రైస్ మిల్లులో సోమవారం ప్రమాదం జరిగింది. నేలకొండపల్లికి చెందిన కూలీ రాణి కింద పడిన ధాన్యాన్ని ఎత్తిపోస్తుండగా మిల్లు బెల్ట్‌లో ప్రమాదవశాత్తు ఆమె చేయి పడింది. దీంతో సహచర కూలీలు మిషన్ ఆపి బయటకు తీయగా గాయాలతో బయటపడింది. దీంతో ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య

ఇల్లెందు: ఇల్లెందు మండలం ధనియాలపాడు సమీపాన జామాయిల్ తోటలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కారేపల్లి మండలం చెన్నంగులగడ్డకు చెందిన డి.సురేష్(38) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో కుటుంబంలో గొడవలు జరుగుతుండగా, సోమవారం ధనియాలపాడు సమీపాన జామాయిల్ తోటలో ఉరి వేసుకున్నాడు. ఘటనపై ఆయన భార్య వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగుల్‌మీరా తెలిపారు.

గడ్డి మిషన్‌లో చేయి పడి గాయాలు

ఖమ్మంరూరల్: మండలంలోని తనగంపాడులో వరిగడ్డి కట్టే మిషన్ వద్ద పనిచేస్తున్న వ్యక్తి చేయి అందులో పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. మంగళగూడెం శివారు కొత్తూరుకు చెందిన పోలూరి వీరన్న తన మిషన్‌తో ఓ రైతు పొలంలో వరి గడ్డి కట్టడానికి సోమవారం వెళ్లాడు. ఈక్రమాన మిషన్‌లో ఇరుక్కుపోయిన గడ్డి తీసేందుకు చేయి పెట్టగా అది తిరగడం మొదలైంది. దీంతో వీరన్న కేకలు విని రైతులు చేరుకుని మిషన్ ఆఫ్ చేయగా అప్పటికే చేయి నుజ్జునుజ్జు కావడంతో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు

- మధురై నుంచి ఖమ్మం చేరిన సీపీఎం నేత శ్రీకాంత్ మృతదేహం
- నివాళులర్పించిన వివిధ పార్టీలు, సంఘాల నాయకులు



శ్రీకాంత్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు



సంతాపసభలో తమ్మినేని, ఎంపీ వద్దిరాజు, మాజీ ఎమ్మెల్యే సండ్ర, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: మధురైలో జరిగిన సీపీఎం అఖిలభారత 24వ మహాసభలకు ప్రతినిధిగా వెళ్లి ఆదివారం గుండెపోటుతో మృతి చెందిన పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు, ఖమ్మం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యర్రా శ్రీకాంత్ మృతదేహాన్ని ఖమ్మం తీసుకొచ్చారు. సోమవారం ఉదయం 11 గంటలకు మృతదేహం ఇక్కడకు చేరుకోగా, పార్టీ శ్రేణులు బైక్ ర్యాలీగా మమత ఆస్పత్రికి, అక్కడి నుంచి సీపీఎం జిల్లా కార్యాలయానికి తీసుకొచ్చారు. ఈక్రమంలో వివిధ పార్టీల నాయకులు నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు. కాగా, సంతాప సభ అనంతరం శ్రీకాంత్ మృతదేహాన్ని శ్రీనివాస్‌నగర్‌లోని స్వగృహానికి తీసుకెళ్లారు. శ్రీకాంత్ ముగ్గురు కుమారుల్లో ఒకరు అమెరికాలో ఉన్నందున ఆయన వచ్చాక బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

శ్రీకాంత్ మరణం తీరనిలోటు..

సీపీఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన సంతాప సభలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ శ్రీకాంత్ మరణం ప్రజా ఉద్యమాలకే కాక పార్టీకి తీరని లోటన్నారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడుతూ మధురైలో శ్రీకాంత్ అస్వస్థతకు గురైనట్లు తెలియగానే అక్కడి అపోలో ఆస్పత్రికి తీసుకెళ్లామని చెప్పారు. కానీ రెండో సారి స్ట్రోక్ రావడంతో మృతి చెందాడని ర్కొన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ అఖిలభారత మహాసభలకు మొదటిసారి ప్రతినిధిగా ఎంపిక కావడంపై శ్రీకాంత్ సంతోషపడ్డాడని, అందరం రైలులో వెళ్లి వచ్చేటప్పుడు ఆయన తమతో లేకపోవడం బాధాకరమన్నారు. అలాగే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, మాస్‌లైన్ నాయకుడు గుర్రం అచ్చయ్య తదితరులు మాట్లాడారు. వివిధ పార్టీలు, సంఘాల నాయకులు తుంబూరు దయాకర్‌రెడ్డి, కొండబాల కరుణాకర్, దేవరెడ్డి విజయ్, మచ్చ వెంకటేశ్వర్లు, ఏజే రమేష్, మధు, వంగూరి రాములు, కళ్యాణం వెంకటేశ్వరరావు, బండి రమేష్, వై.విక్రమ్, బొంతు రాంబాబు, భూక్యా వీరభద్రం, యర్రా శ్రీనివాసరావు, బండి పద్మ, డాక్టర్ సి.భారవి, అఫ్రోజ్ సమీనా, ఆవునూరి మధు, ఆవుల వెంకటేశ్వర్లు, ఆవుల అశోక్, ముదిరెడ్డి నిరంజన్ రెడ్డి, పగడాల నాగరాజు, బచ్చు విజయ్‌కుమార్, అన్నం శ్రీనివాసరావు, లింగాల రవికుమార్, దాసరి పూర్ణచందర్, నాగిశెట్టి రాధాకృష్ణ, ఆకుల గాంధీ, పార నాగేశ్వరరావు, కే.వీ.కృష్ణారావు, పసుపులేటి నాసరయ్య, గులాం జాఫర్ తదితరులు నివాళులర్పించారు.

రేపు ఖమ్మం మార్కెట్‌కు సెలవు

ఖమ్మంవ్యవసాయం: సీపీఎం నాయకుడు యర్రా శ్రీకాంత్ అకాల మృతికి సంతాప సూచకంగా.. కార్మిక సంఘాలు, చాంబర్ ఆఫ్ కామర్స్ అభ్యర్థనతో బుధవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు సెలవు ప్రకటించినట్లు ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ విషయాన్ని రైతులు, వ్యాపారులు గమనించాలని సూచించారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

సత్తుపల్లిటౌన్: రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం ములగలపాటి వారిగూడెంకు చెందిన కంటి వెంకటనారాయణ(70) బైక్‌పై సోమవారం వేంసూరు మండలం కుంచపర్తి వస్తుండగా ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయనను 108లో సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

లారీ ఢీకొట్టడంతో విద్యార్థికి తీవ్ర గాయాలు



విద్యార్థిని ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

పెనుబల్లి: సైకిల్‌పై వెళ్తున్న విద్యార్థిని లారీ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలైన ఘటన పెనుబల్లిలో సోమవారం చోటు చేసుకుంది. మండలంలోని చౌడవరం గ్రామానికి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి సడియం వంశీ వీఎం బంజర్ జెడ్పీహెచ్ఎస్ నుంచి మధ్యాహ్నం పాఠశాల ముగిశాక సైకిల్‌పై ఇంటికి వెళ్తున్నాడు. పెనుబల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద ఆయనను కొత్తగూడెం వైపు నుండి విజయవాడ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో నడుము వద్ద తీవ్రగాయాలయ్యాయి. దీంతో వంశీని కానిస్టేబుళ్లు రాజమల్లు, పుల్లయ్య, డ్రైవర్ వీర రాఘవులు పెనుబల్లి ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మం తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని ఎస్సై కె.వెంకటేష్ తెలిపారు.